క్లుప్తంగా

బక్రీద్ పండగ ప్రశాంతంగా నిర్వహించుకోవాలి


మాట్లాడుతున్న సీఐ యుగంధర్

పీలేరురూరల్: ఈ నెల 7వ తేదీన బక్రీద్ పండగ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక సీఐ కార్యాలయంలో ముతవల్లిలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బక్రీద్ పండగ రోజున ఈద్గా వద్ద ప్రశాంతంగా ప్రార్థనలు నిర్వహించుకోవాలన్నారు. ఆవులు, దూడలు, ఒంటెను వధించడం నిషేధమని తెలిపారు. జంతు హింస నివారణ చట్టం 1960, గోవధ నిషేధ చట్టం 1977లకు లోబడి వ్యవహించాలని ఆదేశించారు. ముతవల్లిలు పాల్గొన్నారు.

రూ. 26 లక్షలతో రైతు బజారు ఏర్పాటు


స్థలాన్ని పరిశీలిస్తున్న ఏడీ త్యాగరాజు

పీలేరు: పట్టణంలో రూ.26 లక్షలతో రైతు బజార్ ఏర్పాటు చేయనున్నట్లు ఏడీ త్యాగరాజు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రామ్మూర్తి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో, సీఎల్ఆర్సీ కార్యాలయం ప్రక్కన స్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు బజార్‌తోపాటు, టమాట మార్కెట్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు రహంతుల్లా, వనిత పాల్గొన్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న ఎంపీడీవో సుధాకర్

కేవీపల్లి: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీవో సుధాకర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నరేంద్రకుమార్, వైస్ ఎంపీపీ వెంకట రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞాన మందిరాలు

కలికిరి: గ్రంథాలయాలు విజ్ఞాన మందిరాలని ప్రముఖ రచయిత, ఎస్వీయూ మాజీ పాలక మండలి సభ్యులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ పేర్కొన్నారు. గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులకు గురువారం ప్రోత్సాహక బహుమంతులు అందజేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రంథాలయాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న దాతలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సభ్యుడు మిండిగల్ లక్ష్మణ్ కుమారుడు దేవాన్ష్ రాజు పుట్టిన రోజు వేడుకలను శబరి ఆశ్రమంలో గురువారం నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులు, చిన్నారులకు స్వీట్లు అందజేసి అన్నదానం చేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు మంజూరు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని సర్కార్ స్కూళ్లకు ప్రభుత్వం మంజూరుచేసిన విద్యా సామగ్రిని ఎంఆర్సీలో భద్రపరిచామని ఎంఈఓ-టూ గౌస్‌పీర్ అన్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 3,235 బ్యాగులు, 3,200 జతల యూనిఫాం, 14 వేల పాఠ్య పుస్తకాలు, 18 వేల నోటు పుస్తకాలు మంజూరయ్యాయన్నారు. ఇంకా షూలు, బెల్టులు, డిక్షనరీలు రావాల్సి ఉందని ఆయన వెల్లడించారు.

వైభవంగా పూజలు

బి.కొత్తకోట: స్థానిక హరిమందిర వీధి ఆలయంలో సీతా కోదండరామస్వామి. లక్ష్మణ స్వామి, ఆంజనేయస్వామి, మహాగణపతి, సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా కలశస్థాపన ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమాలు, మహామంత్ర పుష్పం, మహా మఘళహారతి కార్యక్రమాలను నిర్వాహకులు నిర్వహించారు. శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపన వైభవంగా జరగనుంది.

కూటమి వచ్చె..కష్టాలు తెచ్చె!

ఒక్కో వలంటీర్‌కు రూ.10 వేలు వేతనం ఇస్తాం అంటూ హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్ల వ్యవస్థపై కక్షకట్టి నిర్వీర్యం చేసింది. అంతటితో ఆగని కూటమి సర్కార్ సచివాలయ వ్యవస్థపై విషం కక్కింది. తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో ప్రభుత్వ పాలనలో మార్పులు తెచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన తీసుకువస్తే.. అది నేరంగా భావించిన కూటమి ప్రభుత్వం వాటిని కుదించి ఉద్యోగులను ముప్పుతిప్పలకు గురిచేస్తోంది.

- వలంటీర్లకు రూ.10 వేల వేతనమని నమ్మించి వేటు
- సిబ్బంది సంఖ్య తగ్గింపుతో సేవలకు దూరం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దనే సేవలు



పెద్దతిప్పసముద్రం సచివాలయం

బి.కొత్తకోట: తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గంలో రెండు వేల మంది జనాభాకు ఒక సచివాలయాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మదనపల్లె మున్సిపాలిటీ, బి.కొత్తకోట నగర పంచాయతీలో వార్డు, గ్రామీణ ప్రాంతాల్లో 175 గ్రామ సచివాలయాలను ఏర్పాటుచేసింది. ఈ వ్యవస్థతో మండల కేంద్రానికి రావాల్సిన అవసరం లేకుండా ఎక్కడికక్కడ ప్రజల సమస్యలు తీర్చాయి. ప్రయాణ భారం, వృథా సమయం తప్పింది. కూటమి ప్రభుత్వం వీటిపై నిర్లక్ష్యం చేస్తూ రెండు సచివాలయాలను ఒక క్లస్టర్‌గా మ్యాపింగ్ చేస్తున్నారు. సాంకేతిక విభాగానికి చెందిన ఉద్యోగులు గ్రామ రెవెన్యూ అధికారి, ఏఎస్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వ్యవసాయ (అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్), పశుసంవర్ధక (వెటర్నరి, ఫిషరీష్), ఎనర్జీ అసిస్టెంట్ ఉద్యోగులు ఏడుగురు, సాధారణ పరిపాలనకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి-గ్రేడ్ 1–5, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ మరియు ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, గ్రామ మహిళ పోలీసు ఉద్యోగులు ఐదుగురు ఉంటారు. ఉద్యోగుల సంఖ్య తగ్గిపోనుంది. ఫలితంగా సేవలు పొందడానికి కష్టాలు తప్పవు.

అందుబాటులో పెట్టిన సేవలివే...

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాల్లో 545 రకాల సేవలను ప్రజలు పొందేవారు. ఏ పనికైనా సచివాలయానికి వెళ్తే ఉద్యోగులు వాటికి సంబంధించిన పనులు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొత్తం సేవల్లో కొన్నింటిని మాత్రమే అందిస్తోంది. అందులో ఎక్సైజ్ అండ్ రెవెన్యూకు సంబంధించి 34, పౌరసరఫరాలు 2, ఆరోగ్య, కుటుంబసంక్షేమం 3, జీఎస్‌డబ్ల్యూఎస్ 4, మానవ వనరులు 1,పీఆర్ అండ్ మున్సిపల్ 1, (ఇందులోనే 25 అంశాలు పెట్టారు), సదరం 1, మైన్స్ 1, విపత్తు, అగ్నిమాపక 3, రవాణా 5, ఎపీఓఎస్ఎస్ 2, చెల్లింపుల సేవలు 3, మీసేవల్లో కూడా అందుబాటులో ఉండేవి 87. ఇవిపోగా మిగిలిన సేవలన్నీ కూటమి ప్రభుత్వం బంద్ చేసేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 545 సేవలను ప్రజలు పొందడం జరిగేది. ఇప్పుడు 173 సేవలు మాత్రమే అందుబాటులో పెట్టారు. మిగిలిన 372 ప్రభుత్వ సేవలు ప్రజలకు దూరం చేశారు. ఈ సేవల కోసం ప్రజలు మీసేవ కేంద్రాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

వలంటీర్లు మాయం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో 2,838 మంది వలంటీర్లను నియమించింది. ఇంటింటికి వెళ్లి సేవలు అందించే ఈ వలంటీర్లు ఇప్పుడు కనిపించడం లేదు. కూటమి సర్కార్ తమకు రూ.10 వేల వేతనం ఇచ్చి గౌరవిస్తుందని ఆశించిన వలంటీర్లపై కూటమి ప్రభుత్వం నీళ్లు చల్లింది. వేతన మాట దేవుడెరుగు, అసలు వ్యవస్థనే అచేతనావస్థలోకి నెట్టేశారు. దీనిపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిఇంటికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకొంటూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసిన వలంటీర్ల వ్యవస్థను దూరం చేయడంతో ప్రజలకు సేవలు దూరమై..ఇప్పుడు ప్రతిపనికి కార్యాలయాలు, దళారులు, నాయకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

వలంటీర్లు, సచివాలయాల వివరాలు ఇవీ..

మండలం	వలంటీర్లు	సచివాలయాలు
బి.కొత్తకోట	288	15
మదనపల్లె పట్టణం	440	44
మదనపల్లెరూరల్	573	24
రామసముద్రం	241	15
నిమ్మనపల్లె	174	12
తంబళ్లపల్లె	195	12
పెద్దతిప్పసముద్రం	217	15
కురబలకోట	220	11
పెద్దమండ్యం	216	11
ములకలచెరువు	235	16

సేవలు తగ్గాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏ పథకం పొందాలన్నా.. ఏ సేవ కోసమైనా సచివాలయం వెళ్లి పనులు చేసుకునే వాళ్లం. సమస్య అక్కడే చెప్పుకుని పరిష్కారం పొందడం జరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితులు లేవు. పొందుతున్న సేవలను తగ్గించేసి ప్రాధాన్యం లేకుండా చేస్తున్నారు. ఈ వ్యవస్థను పటిష్టం చేయాలి.

–రాజు, మదనపల్లె

ప్రదక్షణ చేస్తున్నాం



వలంటీర్లు లేకపోవడంతో పనులు చేయించుకునేందుకు కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మా పనులు చూసుకొంటూ ఇబ్బంది లేకుండా ప్రభుత్వ సేవలు, పథకాలు పొందేవాళ్లం. ప్రస్తుతం ఏ పని కోసమైనా పనులు మానుకుని కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల చాలా నష్టపోతున్నాం.

– గీతమ్మ, పెద్దతిప్పసముద్రం

నమ్మించి మోసం



వలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10 వేల వేతనం ఇస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇస్తే నమ్మాం. అధికారంలోకి వచ్చాక వలంటీర్ల గురించి పట్టించుకోవడం లేదు. వలంటీర్ల బాధ్యతలు చేపట్టాక ప్రజలకు సేవ చేస్తున్నామన్న తృప్తి కలిగింది. దీనిపై కూటమి ప్రభుత్వం వలంటీర్లకు న్యాయం చేయాలి.

–ఎం.మంజునాథరెడ్డి, బి.కొత్తకోట

ప్రశాంత వాతావరణంలో బక్రీద్ జరుపుకోవాలి

– సబ్ కలెక్టర్ మేఘస్వరూప్


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె రూరల్: త్యాగాలకు ప్రతీక బక్రీద్ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ విజ్ఞప్తి చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పీస్ కమిటీ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ... పండగ సమయంలో వివిధ శాఖల నుంచి చేయాల్సిన పనులు, అందించాల్సిన సౌకర్యాలపై స్పష్టంగా వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణ, నీటి వసతి, ట్రాఫిక్ ఇబ్బందులపై దృష్టి సారించి, ఎక్కడ, ఎలాంటి సమస్య తలెత్తకుండా మున్సిపల్, పంచాయతీ, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు ఎప్పటికప్పుడు జంతువుల వ్యర్థాలను తొలగించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అసాంఘిక శక్తులు చేసే ప్రయత్నాలపై పోలీసులు అప్రమత్తంగా ఉండి, సామాజిక మాధ్యమాల్లో విషపూరిత ప్రచారాలు జరగకుండా నిఘా ఉంచాలన్నారు. డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ...పశువుల అక్రమ రవాణా జరిగితే పోలీసులకు చేరవేయాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలుంటాయని తెలిపారు. పీస్ కమిటీకి హాజరైన అన్ని మజీద్ కమిటీ పెద్దలు, హిందూ సంఘాల ప్రతినిధులు తమ వంతు సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డీఏఓ రాఘవేంద్ర, ఎన్.ఫిరోజ్ ఖాన్, పల్లవి, డీఈ శ్రావణి, వన్‌టౌన్ సీఐ ఎరీషావలి, విశ్వనాథ్, డీఎల్‌పీఓ నాగరాజు, గుండ్లూరు రఫీ, దాదాపీర్‌ఖాన్, నూర్‌ఆలం, ఆకులకృష్ణమూర్తి, భగవాన్, బరినేపల్లిరవి, బింగిపాండు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మదనపల్లె: మున్సిపాలిటీల్లోని ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు మదనపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మిక నాయకులు కమిషనర్‌కు ప్రమీలకు గురువారం వినతిపత్రం అందించారు. 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. సర్వీసు, విద్యార్హతలను బట్టి ఉద్యోగం, వేతనం నిర్ణయించాలని కోరారు. కార్మికుల పనిని ఎనిమిది గంటలకే పరిమితం చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని నాయకులు కోరారు. ఆప్కాస్‌లోని నాన్ పీహెచ్ కార్మికులను తొలగించి ఇంజినీరింగ్ కార్మికులుగా నమోదు చేయాలని కోరారు. ఉద్యోగ విరమణ 62 ఏళ్లకు పెంచాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్న డిమాండ్లను తీర్చే వరకు సమ్మెలో ఉంటామని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి


దుస్తులు అందజేస్తున్న స్పెషల్ ఆఫీసర్ లక్ష్మీపతి

మదనపల్లె సిటీ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని గ్రామ సచివాలయ ప్రత్యేక అధికారి లక్ష్మీపతి పేర్కొన్నారు. మండలంలోని సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హాకీ, ఫుట్‌బాల్ వేసవి శిబిరం ముగింపు సమావేశం గురువారం జరిగింది. లక్ష్మీపతి మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో విద్యార్థులు క్రీడల్లో మెలకువలు నేర్చుకోవడం అభినందనీయమన్నారు. ఆటలు ఆడడంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారన్నారు. పోటీల్లో విజేతలకు మెడల్స్, క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్ మస్రూర్, పవన్, చంద్రశేఖర్, నాగరాజు, నరేష్, శ్రీనివాసులు, సాయి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు.

ప్రతిభ పురస్కారాలకు విద్యార్థుల ఎంపిక


ఎ.మనోజ్ఞ


ఎ.రెడ్డిసుదీప్

మదనపల్లె సిటీ: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన స్థానిక సొసైటీ కాలనీలోని విజయ భారతి ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు ఎ.మనోజ్ఞ, పి.రెడ్డిసుదీప్ ప్రతిభా అవార్డులకు ఎంపికయ్యారు. మనోజ్ఞ 596 మార్కులు, పి.రెడ్డి సుదీప్ 596 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. వీరిని కరస్పాండెంట్ ఎస్.సేతు, వైస్ ప్రిన్సిపల్ నిశ్చల అభినందించారు.

కలికిరి: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికై నట్లు ఎంఈఓ కరీముల్లా తెలిపారు. ఏపీఎంజేపీ బీసీ బాలికల గురుకుల పాఠశాల నుంచి బి.శిరీష, ఎల్.దివ్య, ఎ.లక్ష్మీప్రియ, బాలికోన్నత పాఠశాల నుంచి జే.సలోని, ఇండియన్ పబ్లిక్ స్కూల్ నుంచి గోవర్ధన్‌రెడ్డి, అక్షర పాఠశాల నుంచి జీవన్ కుమార్ ఎంపిక కాగా వారికి ఈ నెల 9న కలెక్టర్ చేతుల మీదుగా రూ.20 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

సోలార్‌పై అవగాహన

తంబళ్లపల్లె: ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద గృహవిద్యుత్ వినియోగదారులకు సోలార్ రూఫ్ టాప్‌పై ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ట్రాన్స్‌కో ఎల్ఐ భాస్కర్ గృహ విద్యుత్తు వినియోగదారులకు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఆదాతోపాటు బిల్లులలో నష్టపోకుండా ఆర్థిక లబ్ధి పొందవచ్చునన్నారు. ఇంటి పైకప్పు పది చదరపు మీటర్లు లేదా వంద చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన టాప్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన రూ.30 వేలు ప్రభుత్వ రాయితీ ఉంటుందన్నారు. గృహ విద్యుత్ వినియోగదారులకు ఈ అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆసక్తికలిగిన విద్యుత్ వినియోగదారులు ఎపీఎస్పీడీసీఎల్, పీఎం సూర్యఘర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, ఏపీఎం గంగాధర్, ఏపీఓ అంజనప్ప పాల్గొన్నారు.

ప్రముఖుల పరామర్శ


రామిరెడ్డి కుటుంబీకులను పరామర్శిస్తున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్: మండలంలోని వలసపల్లె పంచాయతీ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రామిరెడ్డి చిత్రపటానికి నిసార్‌అహ్మద్ నివాళి అర్పించారు. గురువారం వలసపల్లెలో జరుగుతున్న రామిరెడ్డి దశదిన కర్మకు హాజరైన ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేస్తున్న నాయకులు రామిరెడ్డి మరణం బాధాకరమన్నారు. మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై రామిరెడ్డి ఎనలేని అభిమానం చూపించేవారన్నారు. అనారోగ్యంతో రామిరెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం పార్టీకి తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో ఎస్.సుబ్బారెడ్డి, నాగరాజ రెడ్డి, సురేంద్రరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, చిన్నరెడ్డెప్ప, రామిరెడ్డి, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, చరణ్, నర్సింహులు, కొత్తపల్లె మహేష్, యూనస్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు


అడ్మిషన్ పొందుతున్న విద్యార్థులు

మదనపల్లె సిటీ: విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు మొదటి దశ విద్యార్థుల ఎంపిక పూర్తయినట్లు సమగ్ర శిక్ష జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి, ఆర్‌టీఈ జిల్లా నోడల్ అధికారి కరుణాకర్ తెలిపారు. మదనపల్లె ప్రైవేట్ పాఠశాలల్లో ఇద్దరు చేనేత కార్మిక కుటుంబాల పిల్లలను గురువారం ఆయన అడ్మిషన్ చేయించారు. జిల్లాలో 456 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 389 మందికి సీట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఈ నెల 7వ తేదీలోపు కేటాయించిన పాఠశాలల్లో చేర్చాలని సూచించారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎలాంటి ట్యూషన్ ఫీజు లేకుండా విద్యార్థులకు ఉచిత విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, సీఆర్‌పీ ఫణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు: పీలేరు గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల మేరకు శానిటేషన్, వీధి దీపాలు, ఆర్‌వో ప్లాంట్ల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందించాలన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అవుతున్నందున, విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవో గురు మోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డుమెంబర్లు ఉదయ్, మల్లికార్జునరెడ్డి, సాంబశివారెడ్డి, సచిన్, కాలేషా, విక్టరీ వెంకటరమణారెడ్డి, శ్రీనాథరెడ్డి, అబీద్, నాగరాజ నాయక్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం ర్యాలీ విజయవంతం


మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): వైఎస్సార్‌సీపీ అధిష్టానం పిలుపు మేరకు నియోజకవర్గ కేంద్రం పీలేరులో బుధవారం నిర్వహించిన ‘వెన్నుపోటు దినం’ విజయవంతమైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారన్నారు. అధికార ధర్పానికి వెరవకుండా క్షేత్ర స్థాయిలో కార్యకర్తలు తరలిరావడం అభినందనీయమని, కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అక్రమాలపై పేద ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం కొనసాగుతుందన్నారు.

యోగాంధ్రపై అధికారుల సమీక్ష


రామసముద్రంలో యోగాసనాలు వేస్తున్న అధికారులు

రామసముద్రం: యోగాంధ్రలో భాగంగా ఈ నెల 7న నిర్వహించే యోగ కార్యక్రమంపై ఎంపీడీఓ భాను ప్రసాద్ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా అధికారులచే యోగాసనాలు వేయించారు. రామసముద్రం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దారు నిర్మలాదేవి, ఎంఈవో హేమలత, ఏపీఎం సాంబశివ, ఏపీవో మాధవి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏ కుటుంబానికి సర్పంచ్ సాయం

మదనపల్లె రూరల్: మండలంలోని పోతబోలు పంచాయతీ గాండ్లపల్లె హరిజన వాడకు చెందిన వీఆర్ఏ పోతన్న కుమారుడు రవికుమార్‌కు వైఎస్సార్‌సీపీ నేత, గ్రామ సర్పంచ్ ఈశ్వరయ్య రూ.25 వేల ఆర్థికసాయం చేశారు. చెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతగున్న రవికుమార్‌ను వేలూరు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన సర్పంచ్ ఈశ్వరయ్య.. ఆస్పత్రికి వెళ్లి తనవంతు సాయం అందజేశారు. పోతబోలు గ్రామస్తులు లక్ష్మీపతి, సుధాకర్ ఆయన వెంట ఉన్నారు.

హనుమద్వాహనంపై ఊరేగిన లక్ష్మీనారసింహుడు

కలికిరి: పట్టణంలో వెలసిన లక్ష్మీ నరసింహా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజున గురువారం రాత్రి లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవ మూర్తిని హనుమద్వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం తిరుమంజన సేవ శాస్త్రోక్తంగా జరిపి..అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించగా.. భక్తులు దర్శించుకున్నారు.

స్కూల్ బస్సులకు జరిమానా వేయాలి

మదనపల్లె రూరల్: ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి టీడీపీ మహానాడుకు బస్సులను పంపిన ప్రైవేటు విద్యా సంస్థల యజమానులకు జరిమానా వేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ కోరారు. మీడియాతో గురువారం ఆయన మాట్లాడుతూ... కడపలో జరిగిన మహానాడుకు మదనపల్లె నియోజకవర్గం నుంచి వందల సంఖ్యలో ప్రైవేట్ స్కూల్ బస్సులు, ఏ ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంపారో ప్రజలకు తెలపాలన్నారు. ఆర్టీఓ వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత


మొక్కలు నాటుతున్న ఆర్‌డీవో శ్రీనివాస్

పీలేరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రాయచోటి ఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో గురువారం మొక్కలు నాటారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం ఏపీ టూరిజంకు సంబంధించిన 1/28లో 98 సెంట్ల స్థలాన్ని పరిశీలించారు. గూడరేవుపల్లెలో జరిగే రెండో విడత భూ సర్వే తనిఖీ చేసి పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. అనంతరం పీలేరు పట్టణంలో సీఎస్ఎన్, ఎస్వీ మహల్, జీవీ సీఎస్ఆర్ సినిమా థియేటర్లను సందర్శించి సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మదనపల్లె రోడ్డు మార్గంలో ఆర్‌వోబీ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.భీమేశ్వరరావు, డీటీ ప్రసాద్, సర్వేయర్ కీర్తన, వీఆర్వోలు సిద్ధయ్య, రెడ్డిశేఖర్, కల్యాణి పాల్గొన్నారు.

కేవీపల్లి: మానవ మనుగడకు మొక్కలే ఆధారమని పీలేరు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షబియా సుల్తానా అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని కర్ణంవారిపల్లెలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొక్కలను రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద మొక్కలు పెంచాలని నగర పంచాయతీ కమిషనర్ జీవీ.పల్లవి అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక నందిశెట్టివీధి, ఇందిరమ్మ కాలనీలో గురువారం మొక్కలు నాటారు. పల్లవి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం చేపట్టేవారు విధిగా మొక్కలు నాటేలా సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్ మొక్కలు నాటారు. వైద్యులు ఆరీఫుల్లా, హసీనాబేగం, దుర్గాదేవి, వెంకటరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపల్ మొక్కలు నాటారు.

విద్యార్థినుల ప్రతిభ

మదనపల్లె రూరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎస్వీ యూనివర్శిటీ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనపరిచారు. విద్యార్థినులు ఐశ్వర్య, మైథిలి, శ్రీలేఖ విజేతలుగా నిలిచారు. ఎస్వీ యూనివర్శిటీ వీసీ.అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, కో–ఆర్డినేటర్ వివేక్ చేతుల మీదుగా వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపల్ సురభి.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ రాఘవేంద్ర ప్రత్యేకంగా అభినందించారు.

ములకలచెరువు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బురకాయలకోట అటవీ సెక్షన్ సిబ్బంది గురువారం మొక్కలు నాటారు. ప్రభుత్వాసుపత్రి పరిసరాలు, గురుకుల పాఠశాల, కస్తూర్బా బాలికా విద్యాలయంలో 50 మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

మదనపల్లె సిటీ: పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలకృష్ణమూర్తి అన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు శివపార్వతి, వెంకట రమణ, బాలరాజు, మురళీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రిన్సిపల్ సతీష్ బాబు, డీన్ భాస్కర్, అమరనాథ్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని జీఆర్‌టీ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

రామసముద్రం: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రామసముద్రం మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఎంపీడీవో భాను ప్రసాద్, ప్రిన్సిపాల్ చిట్టిబాబు ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు. వారు మాట్లాడుతూ భావితరాల కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాల్సిన బాధ్యత చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మాధవి, ఈవోపీఆర్‌డీ గఫూర్, రూపేష్, ఆరోగ్య , సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.